కల్వర్టుల నిర్మాణంపై రైతుల ఆందోళన

- వరదను పొలాలపై మళ్లించేలా పనులు చేస్తున్నారని ఆగ్రహం
- తక్షణమే నిలిపివేయాలంటున్న రైతులు

విజయవాడరూరల్: విజయవాడ-నూజివీడు మార్గంలో ఆర్అండ్బీ శాఖ నిర్మిస్తున్న కల్వర్టుల నిర్మాణంపై నున్న గ్రామ రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సెప్టెంబరు నెలలో వచ్చిన బుడమేరు వరదల్లో నగర శివారు ప్రాంతాలైన కండ్రిక, రాజీవ్‌నగర్, పాయకాపురం ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఆ వరదల్లో ఇళ్లతో పాటు పంట పొలాలు ముంపునకు గురవ్వగా ప్రజలకు, వ్యవసాయ పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. భవిష్యత్‌లో ఈ ప్రాంతాలకు వరదలు సంభవిస్తే వరదనీరు నిల్వ ఉండకుండా వెళ్లిపోయే విధంగా విజయవాడ-నూజివీడు ఆర్అండ్బీ రహదారిలో రెండు కోట్ల రూపాయలతో నాలుగు కల్వర్టులు ప్రభుత్వం నిర్మిస్తోంది. వరద నీరు కల్వర్టుల ద్వారా కింద ప్రాంతాలకు వెళ్లే విధంగా డిజైన్ చేసి నిర్మిస్తుంది.


విజయవాడ ఆర్అండ్బీ రోడ్డులో నిర్మిస్తున్న కల్వర్టులు

పంట పొలాల వైపు వరద నీరు.....

ఆ వరద నీరు మా పంట పొలాల వైపు వచ్చే విధంగా డిజైన్ చేశారని నున్న గ్రామ రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత వరద నివారణ చర్యల పేరుతో వ్యవసాయ పంటలను పండించే రైతులను మోసం చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మురుగును మా పంట పొలాలకు మళ్లించే చర్యలు నిలిపివేయాలని కోరారు. కల్వర్టుల నిర్మాణ పనులు ఆపివేయాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరం నుంచి మురుగునీరు పంపించేందుకు అవుట్‌పాల్ డ్రెయిన్ నిర్మించాలే తప్ప రైతుల పొలాలపైకి వరద నీరు పంపే చర్య సరైందికాదని వాపోతున్నారు. కల్వర్టుల ద్వారా వచ్చే నీరు కండ్రిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా వున్న డ్రెయినేజీ కాల్వలోకి రాకుండా వీఎంసీ అడ్డంగా గోడ నిర్మించడం ఏమిటని రైతులు నిలదీస్తున్నారు. పంట పొలాలకు రాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని లేకపోతే కోర్టును ఆశ్రయిస్తామని అంటున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంటున్నారు.

కోర్టును ఆశ్రయిస్తాం



రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ-నూజివీడు ఆర్అండ్బీ రోడ్డులో నిర్మిస్తున్న నాలుగు కల్వర్టుల నిర్మాణ పనులు వెంటనే నిలిపి వేయాలి. వరద ముంపును పంట పొలాలవైపు మళ్లించే చర్యలు సరైనవి కావు. ఆర్అండ్బీ అధికారులు స్పందించకుంటే రైతుల శ్రేయస్సు కోసం కోర్టును ఆశ్రయిస్తాం.

–కలకోటి శ్రీనివాసరెడ్డి, మండల రైతు సంఘం కార్యదర్శి

నష్టం కలిగించే చర్యలు నిలిపివేయాలి



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్టం కల్గించే చర్యలు చేపట్టడం సరైంది కాదు. నగర శివారు ప్రాంతాల మురుగునీరు, బుడమేరు వరదను రైతుల పంట పొలాలపైకి మళ్లించే చర్యలు నిలిపివేయాలి. అవుట్‌పాల్ డ్రెయిన్ నిర్మించి ముస్తాబాద్ 33 తూములకు వరద వెళ్లే విధంగా పనులు చేపట్టాలి.

–ఉయ్యూరు రామిరెడ్డి, నున్న, గ్రామ రైతు


నిర్మాణంలో కల్వర్టు


కాల్వలో అడ్డంగా నిర్మించిన గోడ

క్లుప్తంగా

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



పెనమలూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలం ఆక్రమణలకు గురికాకుండా ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే బోడెప్రసాద్ సోమవారం శంకుస్థాపన చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సహకారంతో పాఠశాల స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించనున్నారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు రూ.5 లక్షలు విరాళం ఇచ్చారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కిలారు శివకుమార్, సర్పంచ్ లింగాల భాస్కరరావు, గ్రామ పెద్దలు మారుపూడి ధన కోటేశ్వరరావు, కోయా ఆనంద్ ప్రసాద్, కిలారు బసవపున్నయ్య, కిలారు బ్రహ్మాజీ, బొమ్మిడి అన్నపూర్ణ, సత్యనారాయణ, కిలారు వెంకటసుబ్బారావు, చిగురుపాటి శ్రీనివాసరావు, ఎం.రామకృష్ణ, ఎంపీడీవో బండి ప్రణవి, తహసీల్దార్ గోపాలకృష్ణ పలువురు పాల్గొన్నారు.

వంటశాల నిర్మాణానికి ఆర్థిక సాయం



పెనమలూరు: వణుకూరులోని ఆదరణ వృద్ధుల ఆశ్రమంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న వంటశాలకు వైఎస్సార్ సీపీ నేతలు సోమవారం ఆర్థిక సాయం అందించారు. పెనమలూరు మాజీ సర్పంచ్ కిలారు వెంకటేశ్వరరావు(బుడ్డి) రూ.5116 సొమ్ము విరాళంగా ఇవ్వగా పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు ఆశ్రమ నిర్వాహకులకు సొమ్ము అందచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చాగంటి వెంకట సాంబశివరావు, తెన్నేటి ప్రకాష్, వెంకటరాజు పలువురు పాల్గొన్నారు.

పేదలకు రంజాన్ తోఫా పంపిణీ



పెనమలూరు: రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లిం మహిళలకు వైఎస్సార్ సీపీ నేతలు నిత్యావసర సరుకులతో రంజాన్ తోఫా అందచేశారు. కానూరు సనత్‌నగర్ 31వ డివిజన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మొహమ్మద్ సిద్దిక్ 100 మంది పేద ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఇచ్చినట్లే ఈ ఏడాది కూడా పేద ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా అందచేశామన్నారు. వైఎస్సార్ సీపీ తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ముస్లింకు అండగా ఉంటుందన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్ర భారతీ స్కూల్ సమీపంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపకురాలు టి. జ్యోతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేసవిలో కూడా ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. బాటసారులు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. గూడవల్లి నరసయ్య, బొప్పన హరికృష్ణ, ప్రిన్సిపాల్ ఊర్వశి తదితరులు పాల్గొన్నారు.

పోరంకిలో ఉపవాస ప్రార్థనలు



పెనమలూరు: పోరంకిలో ఉపవాస ప్రార్థనలు చేశారు. గ్రామంలో ఆదివారం రాత్రి క్రైస్తవుల తపస్సు కాలంలో భాగంగా బీజేఆర్‌నగర్‌లో ఉపవాస ప్రార్థనలు చేశారు. గ్రామ పురవీధుల్లో పరిశుద్ధ సిలువ మార్గం నిర్వహించారు. దివ్యబలిపూజలు, దివ్య ఆరాధనలు, దివ్యబలిపూజ, పలు ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కానూరు కార్మెల్‌మాత పుణ్య క్షేత్రం ఫాదర్ సలివేంద్రశౌరి, ఫాదర్లు రత్నరాజు, చౌటపల్లి మనోజ్, మేత్రి దేవదానం దివ్య ప్రసాదాలు పంపిణీ చేశారు. కానూరు, కామయ్యతోపు, గంగూరు తదితర ప్రాంతాలనుంచి భక్తులు వచ్చి ఉపవాస దీక్షలో పాల్గొన్నారు.

ఈడుపుగల్లులో ఇఫ్తార్

కంకిపాడు: రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని ఈడుపుగల్లు మసీదులో సోమవారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, మసీద్ కమిటీ పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు కేటాయించాలి



ఉయ్యూరు: అర్హులందరికీ టిడ్కో గృహాలు కేటాయించాలని సీపీఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి.రాజేష్ కోరారు. పట్టణ సమస్యలపై సోమవారం సీపీఎం నాయకులు కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందించారు. లబ్ధిదారులు టిడ్కో గృహాలు కేటాయించకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అద్దె ఇళ్లల్లో ఇబ్బందులు నడుమ జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దోమల బెడద అధికంగా ఉండటంతో అనారోగ్య సమస్యలతో ప్రజలు మంచాన పడుతున్నారన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్, కీర్తి, సర్వేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ నమోదు క్యాంపులు

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 25, 26 తేదీల్లో కంకిపాడు సచివాలయం, మద్దూరు సచివాలయంలోనూ, ఈ నెల 27, 28 తేదీల్లో దావులూరు సచివాలయం, గొడవర్రు సచివాలయాల్లో ఆధార్ నమోదు శిబిరాలు సాగుతాయని చెప్పారు. ప్రజలు ఆధార్ నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారమే ప్రజా చైతన్యయాత్ర లక్ష్యం

కంకిపాడు: సమస్యల పరిష్కారమే ప్రజా చైతన్య యాత్ర లక్ష్యమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు అన్నారు. ప్రజా చైతన్యయాత్రలో భాగంగా కంకిపాడు పంచాయతీ కార్యదర్శి సాంబశివరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కంకిపాడు పట్టణంలో డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. అనారోగ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉప్పలూరు గ్రామంలో జగనన్న లే అవుట్‌లో అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రొద్దుటూరు గ్రామంలో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలు నెలకొన్నాయన్నారు. గొడవర్రు గ్రామంలోని జగనన్న లే అవుట్‌లో రహదారులు, వీధిలైట్లు, తాగునీటి సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. కుందేరు గ్రామంలోని జగనన్న లే అవుట్‌లోనూ అంతర్గత రహదారులు, డ్రెయిన్ల సమస్య నెలకొందన్నారు. ఆయా గ్రామాల్లో సమస్యలపై ప్రజా చైతన్య యాత్ర బృందాలు పంచాయతీ కార్యదర్శులకు వినతులు అందించాయన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ పోరాటాలు సాగుతాయని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తాడంకి నరేష్, నాయకులు సిహెచ్ శ్రీహరి, వి.శివశంకర్, ఎం.చంటి, వి.రమేష్, పి.దుర్గారావు, కె.నాంచారయ్య, వై.జోజి, పి.నాగేశ్వరరావు, చంటి, శ్రీను పాల్గొన్నారు.


కంకిపాడు పంచాయతీ కార్యదర్శి సాంబశివరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇంటి, నీటి పన్నులు తగ్గించాలని ధర్నా

పెనమలూరు: ప్రజలపై మోపిన నీటి, ఇంటి పన్నులు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. సీపీఎం మండల కార్యదర్శి షేక్.కాశిం మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తాడిగడప మున్సిపాలిటీ ప్రజలకు పన్నుల భారం పడకుండా చర్యలు తీసుకుందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నీటి పన్నులు ఏకంగా రూ.4800 వేయటం దారుణమన్నారు. అలాగే ఇంటి పన్నులపై జరిమానా వేయటం తగదన్నారు. మున్సిపాలిటీలో పన్నులు కారణంగా పేద, మధ్య తరగతి ప్రజల పై ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బోడెప్రసాద్, మున్సిపాలిటీ కమిషనర్ భవానిప్రసాద్ వెంటనే స్పందించి పన్నుల భారం తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ఉప్పాడ త్రిమూర్తి, ఎస్కె.బాబు, మాదునాగేశ్వరరావు, పుసులూరి లక్ష్మినారాయణ, పండమనేని శ్రీనివాసరావు, సీహెచ్.భవాని, ఉప్పాడ ఈశ్వరి, పలువురు పాల్గొన్నారు.


పోరంకిలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

ఉయ్యూరు రూరల్: మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యతని సివిల్ కోర్ట్ న్యాయమూర్తి కె.శ్రీహరి తెలిపారు. మండలంలోని కలవపాముల శ్రీ జ్యోతి పాలిటెక్నిక్ కళాశాలలో న్యాయ సేవాధికార, ఉయ్యూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో రోజురోజుకీ మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వాడకం విపరీతంగా పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని నివారించడంలో విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు రూరల్ ఎస్సై సురేష్ బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది కాగిత గోపీ చంద్ తోపాటు పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీహరి

యలమంచిలి లక్ష్మణరావుకు నివాళి

గన్నవరం రూరల్: సమాజం పట్ల బాధ్యతతో, ముందు చూపుతో వ్యవహరించే వారు చరిత్ర పురుషులని ఎన్నారై గోగినేని శేష శయనరావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి పుణ్యాచారిటీస్ వృద్ధాశ్రమంలో వ్యవస్థాపకులు యలమంచిలి లక్ష్మణరావు 12వ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేష శయనరావు మాట్లాడుతూ లక్ష్మణరావు హార్టికల్చర్ శాఖలో అడిషనల్ డైరెక్టర్‌గా విశేష సేవలందించి, వృద్ధాశ్రమాన్ని ఉన్నత ఆశయంతో, విశాలవంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఖర్చుకు వెనుకాడకుండా స్థాపించిన ఆదర్శనీయుడన్నారు. కార్యదర్శి జాస్తి విజయ భూషణ్‌కుమార్ (బుజ్జి), చెరుకూరి సాయిబాబు, మొవ్వ నరేంద్ర, రవీంద్ర, రిటైర్డ్ టీచర్ ఇందిర, ఆశ్రమ వాసులు, సిబ్బంది పాల్గొన్నారు.


లక్ష్మణరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శేష శయనరావు, విజయభూషణ్

దాళ్వా వరి కొనుగోళ్లు చేపట్టాలని వినతి

కంకిపాడు: దాళ్వా వరి కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. ఈడుపుగల్లు, కంకిపాడు, పునాదిపాడు, ఉప్పలూరు, కోలవెన్ను గ్రామాలకు చెందిన రైతులు తాము సాగు చేసిన వరి పంట వివరాలను అధికారులకు వివరించారు. ఖరీఫ్ వరి సాగులో భారీ వర్షాలు, వరదల కారణంగా పంట దెబ్బతినటంతో రెండో పంటగా దాళ్వా వరి సాగు చేశామన్నారు. పంట కంకి దశకు చేరిందన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా దాళ్వా వరి పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు బాసటగా నిలవాలని విన్నవించారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

క్షయవ్యాధి నియంత్రణపై ప్రజల్లో చైతన్యం

గన్నవరం: ప్రాణాంతకరమైన క్షయవ్యాధి నియంత్రణకు ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలని గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీదేవి పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో టీబీ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ...అత్యంత ప్రమాదకరమైన క్షయవ్యాధి వల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రతి మూడు నిమిషాలకు ఇద్దరు చొప్పున మరణిస్తున్నారని చెప్పారు. క్షయ వ్యాధి మరణాల్లో మన దేశం ప్రపంచంలోనే ఐదో స్థానంలో ఉందన్నారు. రెండు వారాలకుపైగా దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, తగ్గినప్పుడు కఫంలో రక్తం పడటం క్షయవ్యాధి లక్షణాలుగా గుర్తించాలని తెలిపారు. దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవడంతో పాటు ఆరు నెలలు వరకు మందులు ఉపయోగించడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చని చెప్పారు. ఈ వ్యాధిగ్రస్తులకు పోషక ఆహారం నిమిత్తం నెలకు రూ. వెయ్యి చొప్పున ఆరు నెలలు పాటు ఎన్‌పీవై పథకం కింద కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. డాక్టర్ రేచల్, శాస్త్రి, టీబీ యూనిట్ వి.సాంబశివరావు, సూపర్‌వైజర్ రఘు, ల్యాబ్ టెక్నీషియన్లు రాధాకృష్ణ, అమూల్య, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.


గన్నవరంలో ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది


పెనమలూరులో క్షయ వాధిపై ప్రదర్శన

క్షయ వ్యాధి నిర్మూలిద్దాం

పెనమలూరు: సమాజంలో క్షయ వ్యాధి లేకుండా నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల వైద్యాధికారి సాయిలలిత అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. క్షయ వ్యాధి రహిత సమాజం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు బిజిలీ శ్రీనివాస్, రాజా, హెల్త్ విజిటర్ పవన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో జిల్లా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం చేశారు. కంకినాడు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధికి మందులు ఉన్నా, వ్యాధి రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, హెచ్‌వోడీ గురువులునాయుడు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ టి. వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

ఉయ్యూరు: ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో ప్రజ్ఞ చెస్ట్ హాస్పిటల్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్షయ వ్యాధిపై అవగాహన కల్పించి సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. శ్వాసకోశ వైద్య నిపుణులు డాక్టర్ కృపాసాగర్ పరీక్షలు నిర్వహించి, టీబీ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ జోనల్ చైర్‌పర్సన్ ఎండీ ఇస్మాయిల్, ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, ఊర కిషోర్‌కుమార్, హసన్ అహ్మద్ పాల్గొన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో టీబీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధి నివారణ సాధ్యం

కంకిపాడు: క్షయ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి సరైన వైద్యం చేయించుకుంటే నయమవుతుందని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సంతోష చంద్రిక అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఉప్పలూరు పీహెచ్‌సీ పరిధిలో క్షయవ్యాధి అవగాహనా ర్యాలీ, ప్రతిజ్ఞ సోమవారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సంతోష చంద్రిక మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకుని వైద్యం చేయించుకోవటం ద్వారా వ్యాధిని నివారించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ కృష్ణారావు, టీబీ సూపర్‌వైజర్ సంపత్, పీహెచ్ఎన్ రాజమణి, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా అపరాల కొనుగోలు

గన్నవరం: మండలంలోని రైతు సేవా కేంద్రాలు ద్వారా అపరాల పంటలను కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం క్వింటాల్ మినుము పంటకు రూ. 7,400, పెసరకు రూ. 8,682కు కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కేసరపల్లిలోని రైతు సేవా కేంద్రంలో అపరాలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం

కంకిపాడు: ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరమని వైద్యాధికారి డాక్టర్ సుధా ప్రసుజా అన్నారు. ఉప్పలూరు పీహెచ్‌సీ పరిధిలోని కంకిపాడు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటరులో సోమవారం ఫైలేరియా బాధితులకు ఏడు రకాల పరికరాలతో కూడిన కిట్‌లను అందించారు. డాక్టర్ సుధా ప్రసుజా మాట్లాడుతూ ఫైలేరియా బాధితుల ఉపశమనానికి ఈ కిట్లు దోహదపడతాయన్నారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాస్, శివలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

పోలీసుల తీరుతో ఉద్రిక్తత

విజయవాడరూరల్: మండలంలోని పి.నైనవరం గ్రామంలో పోలీసుల తీరు కారణంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కుక్కలవాని కుంటలో ఇళ్ల స్థలాలివ్వాలని ఐదు రోజులుగా నిరుపేదలు ఆందోళన చేస్తున్నారు. సోమవారం ఉదయం ఆకస్మాత్తుగా ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు, మాజీ సర్పంచ్ మాతంగి ఆంజనేయులును పోలీసులు అదుపులోకి తీసుకొని విజయవాడ వన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అలానే శ్రీనివాసరావు, సురేష్‌లను సైతం స్టేషన్‌కు తరలించి సాయంత్రం ముగ్గురిని విడుదల చేశారు. మరో 10 మందిపై వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు కలెక్టర్‌ను కలసి ఇళ్ల సమస్య, అక్రమ అరెస్టుల గురించి వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. పోరంకి సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా ఉదయం 7.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. సీతాపురంకాలనీ, శ్రీనివాసానగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, కృష్ణవేణి స్కూల్, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. స్థానికులు సహకరించాలని కోరారు.

ట్యాలీ విత్ జీఎస్టీపై శిక్షణ

ఉయ్యూరు: నైపుణ్యాభివృద్ధి సంస్థ, వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏజీఅండ్ఎస్‌జి సిద్ధార్థ కళాశాలలో ట్యాలీ విత్ జీఎస్టీపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాంది ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్, ఫౌండేషన్ ప్రతినిధి షేక్ పాషా, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి ఎన్.వసంతరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు అనిల్‌కుమార్, మనోజ్, నాగసాయి పాల్గొన్నారు.

27న వణుకూరు ఉపసర్పంచ్ ఎన్నిక

పెనమలూరు: వణుకూరు గ్రామ పంచాయతీలో ఉపసర్పంచ్ ఎన్నికలు ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఉత్వర్వులు జారీ చేసింది. వణుకూరు గ్రామ పంచాయతీలో 14 మంది వార్డు సభ్యులు ఉండగా వైఎస్సార్ సీపీకి 10 వార్డులు, టీడీపీకి నలుగురు మద్దతుదారులు ఉన్నారు. వీరిలో ఒకరిని ఉపసర్పంచ్‌గా ఎన్నుకోవాల్సి ఉంది. గతంలో వైఎస్సార్ సీపీ మద్దతుతో గద్దల రాజాను ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఒప్పందం ప్రకారం రెండున్నర సంవత్సరాలు గడిచిన తరువాత ఆయన రాజీనామా చేశారు. ఆయన స్థానంలో 2వ వార్డు సభ్యుడు ఆరేపల్లి నాగరాజు ఉపసర్పంచ్‌గా గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఎన్నుకోవాల్సి ఉంది. కాగా ఈ నెల 27వ తేదీన ఈవోపీఆర్డీ బి.శ్రీనివాసరావు ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ సమావేశం ఏర్పాటు చేసి ఉపసర్పంచ్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నారు.

పుల్లేరు కట్టపై వ్యర్థాల తొలగింపు

కంకిపాడు: పుల్లేరు కట్టపై పేరుకుపోయిన వ్యర్థాలను ప్రొద్దుటూరు పంచాయతీ అధికారులు ఎట్టకేలకు తొలగించారు. ప్రొద్దుటూరు గ్రామంలో సేకరించిన చెత్త, వ్యర్థాలను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించకుండా పుల్లేరు కాలువ కట్టపై బొడ్డపాడు గ్రామ పరిధిలో పారబోసి, నిత్యం తగలపెట్టడంతో పొగ, వ్యర్థాలు కుళ్లి వెదజల్లే దుర్గంధంతో బొడ్డపాడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యపై బొడ్డపాడు సర్పంచ్ మూడే శివశంకర్ జిల్లా కలెక్టర్ సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రొద్దుటూరు పంచాయతీ అధికారులు పుల్లేరు కట్టపై పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు.